క్లుప్తంగా

దాచేపల్లి కమిషనర్‌గా అప్పారావు

దాచేపల్లి : దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్‌గా ఎంవీ అప్పారావు నియమితులయ్యారు. సత్తెనపల్లి మునిసిపాలిటీలో రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అప్పారావుని దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల్లో అప్పారావు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డీవీఎస్ నారాయణరావుని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కి బదిలీ అయ్యారు.

పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా శ్రీధర్



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా పర్వతనేని శ్రీధర్‌ను బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి గిరికుమార్‌ను మున్సిపల్ కమిషనర్‌గా నియమించడం జరిగింది. ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌ను ఇదే మున్సిపల్ కార్యాలయానికి కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు గ్రామ సభలు

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని మొత్తం 15 గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు శుక్రవారం నిర్వహిస్తున్నారు. గురువారం స్థానిక మండల కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా ఉపాధి హామీకి సంబంధించి మండలంలో రూ.1.75 కోట్ల విలువైన పనులకు ఆమోదం తెలిపేందుకు ఉద్దేశించి సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 21 ఉపాధి హామీ పథకం పనుల ద్వారా గ్రామాలలో సీసీ రోడ్లు, సైడు కాల్వలు, వీధి దీపాలు, మంచినీరు వంటి మౌలిక వసతులను కల్పించటం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీలో ఓ ప్రణాళిక ప్రకారం పనులు నిర్వహించి గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పథకాన్ని వినియోగించనున్నట్లు తెలిపారు. కావున ఆయా గ్రామాలలో చేపట్టవలసిన పనుల గురించి గ్రామ సభల ద్వారా తీర్మానాలను నిర్వహించినట్లు తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి



దాచేపల్లి : జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి చూపించాలని ఎంపీడీవో శోభారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో శోభారాణి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో జాబ్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలన్నారు. కొత్తగా జాబ్ కార్డులు కావాల్సిన వారికి తక్షణమే మంజూరు చేయాలని సూచించారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ సంబంధిత పనులు, వ్యక్తిగత లబ్ధి చేకూర్చే పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామ సభలు

మాచవరం: జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. గ్రామ సభల్లో వేతన కూలీల హక్కులు, గతంలో మంజూరైన పనుల వివరాలు, 2024-25లో కొత్త పనుల గుర్తింపు, ఎన్‌ఆర్‌జీఎస్ పనులపై సామాజిక తనిఖీ ప్రాముఖ్యత తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని పిల్లుట్లలో జరిగే గ్రామ సభకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలియజేశారు. కావున మండల ప్రజలు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

గురు భక్తి చాటుకున్న కిడ్స్ విద్యార్థులు



దుర్గి: మానవ సేవే మాధవ సేవ అని మాచర్ల పట్టణానికి చెందిన కిడ్స్ పాఠశాల విద్యార్థులు చాటారు. తమ పాఠశాల హెచ్‌ఎం జీవీఎస్‌ఆర్ శాస్త్రి జన్మదినం సందర్భంగా గురువారం మండలంలోని ఆత్మకూరు కాశినాయన వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచే సేవా గుణం అలవర్చుకొని పది మందికీ మేలు చేసే ఆలోచన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు సొంత ఖర్చుతో సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు.

గోలి వాగు కష్టాలకు చెక్

- గోలివాగు లో లెవల్ బ్రిడ్జికి మహర్దశ
- నేషనల్ హైవే బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గోలివాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం
- వర్షాకాలంలో గోలివాగొస్తే రాకపోకలు బంద్
- అనేక మందిని కబళించిన గోలివాగు



గోలివాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి



గోలివాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్న దృశ్యం

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివారులో ఉన్న గోలివాగుపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన లో లెవల్ బ్రిడ్జి కారణంగా వర్షాకాలం వస్తే గుంటూరు-మాచర్ల మధ్య రాకపోకలు నిలిచిపోవడం పరిపాటిగా మారింది. వర్షం కురిసినప్పుడల్లా గోలివాగుపై ఉన్న లో లెవల్ బ్రిడ్జి మీదగా 5, 6 అడుగుల మేర నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. బ్రిడ్జికి ఇరువైపుల రైలింగ్ లేకపోవడంతో బ్రిడ్జి మార్జిన్లు తెలియక వాహనాలు వాగులో పడి సుమారు 14 మంది మృత్యువాత పడ్డారు.

■ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023 జనవరిలో మంజూరైన రూ.230 కోట్ల నిధులతో మాచర్ల-దాచేపల్లి మధ్య ఏర్పాటు చేస్తున్న నేషనల్ హైవే 167 ఏడీ బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గోలివాగుపై ఉన్న లో లెవల్ బ్రిడ్జి స్థానంలో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వలన ఇప్పటికైనా ఈ బ్రిడ్జికి మహర్దశ పట్టిందని పల్నాడు ప్రాంతానికి చెందిన అనేక గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాచర్ల-దాచేపల్లి రోడ్డు నిర్మాణం ఇలా...

ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం రెంటచింతల మండలంలో సుమారు 4.2 కి.మీ. పరిధిలో ఉంది. ఎన్‌హెచ్-167 ఏడీ నిర్మాణానికి మొత్తం 34.73 ఎకరాల భూమి అవసరం కాగా అందులో 2.795 ఎకరాలు ప్రభుత్వ భూమి, 1.77 ఎకరాల దేవదాయ శాఖ భూమి, మిగిలిన 30.165 ప్రైవేటు భూమి ఉంది. మొత్తం 43 కి.మీ. పొడవు, 10 మీ. వెడల్పుతో చేపట్టనున్న ఈ ఎన్‌హెచ్-167 ఏడీ రెండు లైన్ల రహదారిలో సుమారు 21.6 కి.మీ. వరకు బైపాస్ ఉంటుంది. వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.11.64 లక్షలు, కమర్షియల్ భూములకు ఎకరాకు రూ.18.90 లక్షల ధరను ఉన్నతాధికారులు నష్ట పరిహారంగా నిర్ణయించడం జరిగింది. ప్రైవేటు భూ యజమానులకు నగదు జమ చేయడం జరిగింది. మరి కొంత మందికి నగదు చెల్లించాల్సి ఉంది.

త్వరితగతిన భూ సేకరణ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం త్వరితగతిన ఈ బైపాస్ రోడ్డు నిర్మాణానికి కావలసిన భూ సేకరణను చేపట్టి నిర్మాణ సంస్థకు అప్పగించింది. అలాగే భూ యజమానులకు నష్ట పరిహారం అందజేయడం కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగింది. దీంతో ఈ బైపాస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమయింది.

వైఎస్సార్‌సీపీ కృషితోనే ఎన్‌హెచ్ 167 ఏడీ నిర్మాణం



అనేక మందిని బలి తీసుకున్న గోలివాగు లో లెవల్ బ్రిడ్జి స్థానంలో ఎన్‌హెచ్ 167 ఏడీ బైపాస్ రహదారి ఏర్పాటు ద్వారా హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కృషి ఎంతో ఉంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన లో లెవల్ బ్రిడ్జి కారణంగా ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నా గతంలో ఏ ప్రభుత్వం కూడా స్పందించిన దాఖలాలు లేవు.

– మద్దిరాల కృష్ణారెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, రెంటచింతల

పల్నాడు ప్రాంత ప్రయాణికులకు తీరిన కష్టాలు



బ్రిటీష్ వారి కాలంలో నిర్మించిన లో లెవల్ బ్రిడ్జి కారణంగా ప్రతి ఏటా వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ప్రమాదం పొంచి ఉంటుంది. పలు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం గోలివాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం వలన ప్రయాణికులు కష్టాలు తీరినట్లే. నేషనల్ హైవే 167 ఏడీ కారణంగా ఇక్కడ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం హర్షణీయం.

– నారాయణపురం శ్రీనివాస్, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రెంటచింతల

గ్రామాలలో ప్రజలు సోదర భావంతో మెలగాలి

సీఐ నఫీస్ బాషా



కంభంపాడు గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నఫీస్ బాషా

మాచర్ల రూరల్: ఎన్నికల వరకే రాజకీయ వర్గాలని అనంతరం గ్రామ అభివృద్ధిలో శాంతిభద్రతల నిర్వాహణలో ప్రజలంతా కలసి శాంతియుతంగా, సోదర భావంతో మెలగాలని రూరల్ సీఐ షేక్ నఫీస్ బాషా కోరారు. గురువారం మండలంలోని కంభంపాడు గ్రామంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా ప్రజలతో ఆయన మాట్లాడారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఎవరైనా అలజడులు సృష్టించాలని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యంగా వర్గాలు, గ్రూపులను కూడగట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అనుమతులు లేకుండా మద్యం, గుట్కా, ఖైనీ వంటి అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ ప్రజలు సోదరభావంతో మెలిగి శాంతియుత వాతావరణానికి దోహదపడాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎస్‌ఐ ఎం.నారాయణ ఉన్నారు.

పోలూరి రాజీనామా

వెల్దుర్తి: మాచర్ల పురపాలక సంఘం వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు గురువారం వైఎస్సార్‌సీపీ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మాచర్ల పట్టణ అధ్యక్షుని కార్యాలయంలో పోలా శ్రీనివాసరావుకు తన రాజీనామా లేఖను అందజేశారు.

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన మహాలక్ష్మి

తాగునీరు, పారిశుద్ధ్యానికే తొలి ప్రాధాన్యత



బాధ్యతలు చేపడుతున్న యల్లా

రెంటచింతల: రెంటచింతల మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో)గా యల్లా మహాలక్ష్మి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో మహాలక్ష్మి ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 1న ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడుకు బదిలీపై వెళ్లారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన పెదప్రోలు శంకర్‌రావు తన సొంత జిల్లా అయిన కృష్ణా జిల్లాకు తిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీవో యల్లా మహాలక్ష్మి మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, తాగు నీటి కల్పనకే తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్య పనుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై స్థానిక అధికారులు అలసత్వంగా ఉండవద్దన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. శుక్రవారం నుంచి మండలంలోని గ్రామాలలో ఉపాధి హామీ పథకం గ్రామ సభలను నిర్వహించేందుకు క్షేత్ర స్థాయి సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామ సభలను నిర్వహించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు.


పత్తి దిగుబడులు ఆశాజనకం



తీసిన పత్తిని ఇంటికి తరలిస్తున్న రైతు

వేసవిలో పత్తి వేసిన రైతులకు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు సగటున 15 క్వింటాళ్ల దాకా వస్తోంది. ఏప్రిల్ నెలలో వేసిన పత్తి తీతలు ఆఖరి దశకు వచ్చాయి. ముందస్తు పత్తి మండలంలో 2,500 ఎకరాలలో వేశారు. పచ్చదోమ ఉధృతి వల్ల ఎర్రబొమ్మిడి తెగులు రావడంతో ఆకులు రాలిపోయాయి. ఎండా కాలంలో కాసే ఎండలు కాస్తుండడంతో పత్తి కాయలు బాగా పగిలాయి. దీంతో రెండు మూడు తీతలతోనే పత్తి తీయడం పూర్తయ్యింది. రేటు కూడా క్వింటా రూ.5,500 నుంచి ప్రస్తుతం రూ.6,200 పలుకుతోంది. దీంతో ముందస్తు పత్తి వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో 15 రోజుల్లో పత్తి పీకివేసి కంది, మిరప లాంటి పంటలు వేయడానికి రైతులు ఆలోచన చేస్తున్నారు. ఇదిలా ఉండగా లేత పైర్లు కాపు దశలో ఉన్నాయి. పైర్లు ప్రస్తుతానికి ఆశాజనకంగానే ఉన్నాయి.

– కారెంపూడి



పొలంలో విచ్చుకున్న పత్తి

నేటి నుంచి ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై గ్రామ సభలు



గ్రామ సభల నిర్వహణపై కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సరోజినీదేవి

మాచర్ల రూరల్: నేటి నుంచి జరగనున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వహణపై జరగనున్న గ్రామ పంచాయతీల సభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎంపీడీవో కె.సరోజినీదేవి కోరారు. గురువారం కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న గ్రామ సభలలో ఉపాధి హామీ కూలీల హక్కులు, అర్హతలపై అవగాహన, అలాగే గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు, 2024-25 సంవత్సరంలో కొత్త పనుల ప్రతిపాదనలు వంటివే కాకుండా సామాజిక తనిఖీ ప్రాముఖ్యత తెలియజేయటం తదితర అంశాలపై ప్రజల మధ్య గ్రామ సభల్లో వారికి వివరించాలని ఆమె సూచించారు. 16 గ్రామ పంచాయతీలలో ఉదయం 9 నుంచి కార్యదర్శుల నేతృత్వంలో ఈ సభలు జరపాలని ఆమె కోరారు. ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు యల్లబోయిన కోటేశ్వరరావు, ఆవుల వెంకట్రామయ్య, బిట్టు వెంకటేశ్వర్లు, బాబులాల్ నాయక్, సత్యనారాయణ, దస్తగిరి, కృష్ణవేణి, సుజాత, వెంకటేశ్వర్లు నాయక్, నరేంద్ర తదితరులు ఉన్నారు.

వెల్దుర్తిలో...

వెల్దుర్తి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వహణపై జరగనున్న గ్రామ సభలను నేటి నుంచి ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎంపీడీవో డి.ప్రసాద్ కోరారు. గురువారం కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న గ్రామ సభలలో ఉపాధి హామీ కూలీల హక్కులు, అర్హతలపై అవగాహన, గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు తదితర అంశాలపై గ్రామ సభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. కార్యదర్శుల నేతృత్వంలో ఈ సమావేశాలు జరపాలని ఆయన కోరారు.

నేడు కారెంపూడిలో ఎమ్మెల్యే జూలకంటి పర్యటన

కారెంపూడి: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం కారెంపూడి మండలంలో పర్యటించనున్నారని ఎమ్మెల్యే కార్యాలయం గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం కారెంపూడిలో కిసాన్ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తారని, అనంతరం కారెంపూడి గ్రామ సభలో పాల్గొంటారని, అనంతరం నరమాలపాడు గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్టా ఉత్సవం, సాయంత్రం కారెంపూడిలో పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి బోనాల ఉత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని గోళ్ళపాడు గ్రామంలోని ప్రధాన కూడలిలో గురువారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసరావుపేట మండలంలోని ఇసప్పాలెం గ్రామానికి చెందిన ఎస్.ఏసుపాదం, ఎం.ఐనయ్య ద్విచక్రవాహనంపై ముప్పాళ్ల నుంచి ఇసప్పాలేనికి వెళుతుండగా, గోళ్ళపాడు ప్రధాన కూడలిలో నరసరావుపేట వైపు నుంచి గ్రామంలోకి వెళుతున్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ ఆటోను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఏసుపాదం, ఐనయ్య కాళ్లకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన

పెదకూరపాడు: పెదకూరపాడులో అంగన్‌వాడీ-2 సెంటర్‌లో 100 రోజులు ప్రణాళికలో భాగంగా అంగన్‌వాడీల్లో అందిస్తున్న సేవలు, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణ నివారణపై తల్లులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త గోగులపాటి కుమారి అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్ని, విశ్రాంత సూపర్‌వైజర్ షేక్ చావా నిర్మల మేరి పాల్గొని, మాట్లాడారు. మూడేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపితే వారికి ఆటపాటలతో కూడిన విద్య, పౌష్టికాహారం అందిస్తారన్నారు. 18 సంవత్సరాలు నిండిన బాలికల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను తల్లులకు వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



అమరావతి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంటి వైద్యాధికారి సుబ్బారావు తెలిపారు. అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 574 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో 21 మందికి దృష్టి సమస్యలను గుర్తించి, కళ్లజోళ్లకు సిఫార్సు చేశామని తెలిపారు. మండలంలోని 2,357 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. పాఠశాల ప్రిన్సిపల్ రాణి ఇందిరా ప్రియదర్శిని, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామకృష్ణ సేవా సమితి సేవలు అమూల్యం

తహసీల్దార్ ఎండీ జియా ఉల్ హక్



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ ఎండీ జియా ఉల్ హక్

మాచర్ల రూరల్: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అందిస్తున్న ఆర్థిక సహాయం అమూల్యమని తహసీల్దార్ ఎండీ జియా ఉల్ హక్ కొనియాడారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల ఆజాద్ నగర్‌లో పూరిగుడిసె దగ్ధమైన బొనిగె మాణిక్యం, ఏసమ్మ కుటుంబీకులకు నిత్యావసర సరుకులు, దుస్తులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదంలో పూర్తిగా నష్టపోయిన బొనిగె మాణిక్యం కుటుంబాన్ని ఆదుకునేందుకు రామకృష్ణ సేవా సమితి నేతృత్వంలో నిత్యావసర వస్తువులే కాకుండా దుస్తులను అందించేందుకు ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఆపదలో ఉన్న తోటి వారిని ఆదుకునేందుకు రామకృష్ణ సేవా సమితి సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ నిమ్మల శ్రీనివాసరావు, సభ్యులు కనకంటి కోటేశ్వరరావు, వీఆర్‌వోలు తదితరులున్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు




కేక్ కట్ చేస్తున్న నాయకులు

దుర్గి: స్వయంకృషితో సినీ ప్రపంచంలో అగ్రతారగా వెలుగొందుతున్న చిరంజీవి నేటి యువతకు ఆదర్శమని పలువురు నాయకులు తెలిపారు. గురువారం పద్మవిభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలను మండల కేంద్రం దుర్గిలోని జంగాల కాలనీలో, పలు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో చిరంజీవి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కటకం రామారావు మాట్లాడుతూ నేటి యువత చిరంజీవి జీవితాన్ని ప్రేరణగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు వెలిదండి శ్రీనివాసరావు, జనసేన సీనియర్ నాయకులు భీమా అమరయ్య, తోటకూర మణికంఠ, ఎస్‌ఎంసీ చైర్మన్ సూరె వెంకటేశ్వర్లు, జక్కా కొండలు, టౌన్ జనసేన అధ్యక్షులు రుద్రాల రవి, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

కాపు యువసేవ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు

గురజాల : రంగా సెంటర్ కాపు యువసేన ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కాపు యువసేన నాయకుడు ఆడపా శ్రీనివాసరావు మాట్లాడుతూ చిరంజీవి రాజకీయంగా మరెంతో ముందుకు సాగాలన్నారు. అందరి ఆశీస్సులు చిరంజీవికి ఉండాలన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శరమాళ్ల హనుమంతరావు, జక్కా దుర్గారావు, సోలసా కిషోర్, జి.నాగేంద్రబాబు తదితరులున్నారు.

డ్రమ్ సీడర్ విధానంతో బహుళ ప్రయోజనాలు



డ్రమ్ సీడర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో దేవదాసు

నకరికల్లు: డ్రమ్ సీడర్ విధానంలో వరి సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. రూపెనగుంట్ల గ్రామంలో మేదరమెట్ల బ్రహ్మయ్య అనే రైతు 3.5 ఎకరాల్లో కేఎస్‌ఎం 1638 వరి రకాన్ని డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగుచేస్తుండగా గురువారం పరిశీలించి, రైతుతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ సీడర్ విధానంలో 12 నుంచి 14 కేజీల విత్తనాలు మాత్రమే ఎకరాకు సరిపోతాయని తెలిపారు. పొలంలో మొక్క సాంద్రత అధికంగా వస్తుందన్నారు. సాధారణ విధానం కన్నా వారం ముందుగానే పంట కోతకు వస్తుందన్నారు. దిగుబడి కూడా 4 నుంచి 5 బస్తాలు అధికంగా ఉంటుందని వివరించారు. ఎకరాకు రూ.6 వేల నుంచి రూ.7 వేల అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఒకే రోజులో నాలుగెకరాల వరకు విత్తనాలు వేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కె.దేవదాసు, వీఏఏ జి.జగదీష్, రైతులు పాల్గొన్నారు.